కథ

# సాయం

తవ్వా ఓబుల్‌రెడ్డి



“ఒరే వెంకట్రాముడూ... ముసిలోల్ల పించను ఇప్పియ్యమని ఈ పొద్దు ఊళ్ళోకొచ్చే ఎమ్మెల్యేతో రొంత సెప్పురాబ్బీ... నీకు పున్నెముంటది” కొడుకును ప్రాధేయ పడినాడు లచ్చుమయ్య.

“పించనా...? నీకా... ఇంగ చాల్లే నోర్మూసుకో... సరిపోని నాకొడకుల్లో, సరికులపోల్లలో మన పిస్టేజేం కావాల... మా నాయనకు ముసిలోల్ల పించను ఇప్పియ్యన్నా అని ఎమ్మెల్యేను అడుక్కోమంటవా” కస్సుమని లేచినాడు, వెంకట్రాముడు.

“పిల్లప్పట్నుంచి ఆ నారాయణరెడ్డి గుంపులో తిరుగుతాండవు... కూటికి గుడ్డకు సచ్చాన్నా నీ ఎచ్చులకేం తక్కువగాదు... ఒక పనిల్యా... పాటల్యా...! ముసిలి ముప్పున ఇంత పిడసేచ్చవనుకుంటే అదీ ల్యాకపాయ...” కొడుకును నిలదీసినట్లుగా అడిగినాడు లచ్చుమయ్య.

“మర్యాదగా నోర్మూసుకోని ఆడ పడి ఉండు బాగుంటది... రోజు పొద్దున లేసి నాలముంచీ నీ సోదేంది నాకు” ఖద్దరు చొక్కా తొడుక్కుంటూ లచ్చుమయ్యను కసురుకున్నాడు వెంకట్రాముడు.

వెంకట్రాముడు లచ్చుమయ్యకు ఒక్కడే కొడుకు. రాజకీయాలు గలాటాలు అంటూ ఎప్పుడూ నారాయణరెడ్డి గుంపులో తిరుగుతూ ఉంటాడు. నారాయణరెడ్డి, ఎమ్మెల్యే సూర్య మోహన్‌రెడ్డి అండదండలతో ఊళ్ళో ఒక వర్గానికి నాయకత్వం వహిస్తున్నాడు. అపోజిషన్ వర్గం నాయకుడు సుధాకర్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యేతో మంచి సంబంధాలుండాయి. స్వార్థ రాజకీయాలకు ఊరు 'పార్టీ కొంప'గా మారింది.

“బీడి ముక్కో... సుట్టో కొనుక్కోవాలంటే జోబిలో పైసా లెక్క ఉండదే... అందరినీ అడుక్కుంటాంటే సూచ్చా మొకం తిప్పుకోని పోతవే... అప్పుడు లేదూ... పిట్టేజి” లచ్చుమయ్య కోపంతో వదరడం మానలేదు.

“ఈ ముసిలోడిది రోజూ ఉండేదేలే” అనుకుంటూ తనకేమీ పట్టనట్లుగా నారాయణరెడ్డి ఇంటి దారి పట్టినాడు వెంకట్రాముడు.

ఆ రోజు ఎమ్మెల్యే సూర్య మోహన్‌రెడ్డికి, నారాయణరెడ్డి విందు ఏర్పాటు చేసినాడు. తాను కాంట్రాక్టు చేసిన మంచినీటి పథకం ప్రారంభోత్సవమే విందుకు సందర్భమైంది.

వెంకట్రాముడూ, నారాయణరెడ్డీ ఊరి బడిలో ఐదవ తరగతి దాకా కలిసి చదువుకున్నారు. నారాయణరెడ్డితో సావాసం వల్ల వెంకట్రాముడికి చదువు రుచించలేదు. నారాయణరెడ్డి కుటుంబ వాతావరణం వెంకట్రాముడికి రాజకీయం నేర్పింది.


“పార్టీ గొడవలు మనకెందుకు... ఎదో ఒక పని చేసుకుని బతుకుతా... నాకు యాలకింత పిడసేసి ఇంటికాడ ఉండురా...” లచ్చుమయ్య బంగపోయి... బంగపోయి... చివరకు వెంకట్రామున్ని వదిలిపెట్టినాడు.

పార్టీ రాజకీయాలు, కాంట్రాక్టులు, పంచాయితీల పేరుతో నారాయణరెడ్డితో పూసుకోని తిరగడం వెంకట్రాముడి దినచర్య.

“కొడుకు సంపాదనా లేదు... ఆస్తి పాస్తులూ లేవు!” నానాటికీ కూటికే కనాకష్టమైపోతాందని లచ్చుమయ్యలో ఆందోళన!

“ఊళ్ళో శానామంది ముసిలోల్లకు పించన్లు వచ్చాండయి గదా! నాకు కూడా వచ్చే బాగుంటది” ఎన్నిసార్లో అనుకున్నాడు లచ్చుమయ్య.

ఊళ్ళోకి ఎమ్మెల్యే రాక లచ్చుమయ్యలో ఆశలు రేకెత్తించింది. ఊళ్ళోని ముసలివాళ్ళతో పోల్చుకుంటే తన పరిస్థితి దారుణంగా ఉందని లచ్చుమయ్య ఆవేదన. ఇద్దరు, ముగ్గురు కొడుకులు ఉండి లచ్చనంగా ఉండే ముసిలోల్లకే పించను వచ్చాన్నెపుడు... తనకు కూడా వచ్చే తప్పేముందని లచ్చుమయ్య ప్రశ్న! తను పించను మ్యాట ఎత్తితేనే వెంకట్రాముడు 'పిట్టేజి' అంటూ గదురుకోవడం లచ్చుమయ్యను మరింత బాధకు గురిచేస్తోంది. అయినప్పటికీ పించను కోసం స్వయంగా ప్రయత్నించి, కుదరక మానుకున్నాడు కూడా!



తవ్వా ఓబుల్‌రెడ్డి

“చెట్టంత కొడుకున్నాడు కదా! పించనెలా వస్తుంది రాదుపో” అన్నారు అధికారులు!

“ఈ పొద్దు ఏమైనాసరే ఎమ్మెల్యేను స్వయంగా అడిగి పించను తెప్పించుకోవాల” ధృడంగా నిర్ణయించుకున్నాడు లచ్చుమయ్య. వెంకట్రాముడి వెనుక నడిచినాడు.

ఎమ్మెల్యేను ఘనంగా ఆహ్వానించేందుకు నారాయణరెడ్డి ఇంటి వద్ద ఏర్పాట్లు భారీగా జరుగుతున్నాయి.

“పదేళ్ళ నుంచీ ఓట్లేపిచ్చుకున్నెడు గదా! ఎందుకు ఇప్పియ్యడు పించను... రానీ... ఏం.... అడుగుతా!”

నారాయణరెడ్డి ఇంటి అరుగుమీద కూర్చుని తనలో తానే అనుకుంటున్నాడు లచ్చుమయ్య.

ఎమ్మెల్యే రాకకు చిహ్నంగా రొంతసేపటికి ఒక కారూ, రెండు జీపులూ దుమ్ము లేపుకుంటూ వచ్చి నారాయణరెడ్డి ఇంటి ముందు ఆగినాయి. ఇద్దరు గన్‌మ్యాన్లతో ఎమ్మెల్యే దిగినాడు. తప్పెట్లు, మేళాలు, బాణాసంచా మోగినాయి. అందరితో పాటుగా ఎమ్మెల్యేకు లచ్చుమయ్య కూడా దండాలు పెట్టినాడు. అనుచరులంతా ఎమ్మెల్యేకు జయజయధ్వానాలు చేసినారు. కొందరు చోటా నాయకులు ఎమ్మెల్యేకు వంగివంగి దండాలు పెడుతున్నారు. కొందరు తాగుబోతులు ఎమ్మెల్యే గొప్పల గురించి వాగుతున్నారు.

ఎమ్మెల్యే, పరుపు వేసిన మంచంపై కూర్చున్నాడు. అనుచరులు చుట్టూ నిలబడినారు.

“దండం పెట్టినప్పుడు ఎమ్మెల్యే చూసినాడో లేదో? మళ్ళా ఒకసారి దండంపెట్టి మాట్లాడి... గట్టిగా పనిచేయించుకోవాల!” అనుకుంటూ జనాన్ని తోసుకుని గుంపు మధ్యలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు లచ్చుమయ్య.

నియోజకవర్గంలోని కాంట్రాక్టర్లూ... ఉద్యోగాలకు రెకమండేషన్లు కోరేవాళ్ళూ... రకరకాల వాళ్ళు ఎమ్మెల్యేను చుట్టుకుని ఉన్నారు.

“చేతిలో బెల్లం ఉంటేనే కదా! ఈగలు ముసిరేది” అనుకున్నాడు లచ్చుమయ్య.

నారాయణరెడ్డీ, వెంకట్రాముడు విందు ఏర్పాట్లలో పడిపోయినారు. నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా అప్పుడప్పుడూ ఎమ్మెల్యేతో మాట కలిపి వెళుతున్నాడు.

ఖద్దరు చొక్కా వేసుకున్న ఒక వ్యక్తి, లచ్చుమయ్యను విసురుగా పక్కకు తోసుకుంటూ హడావుడిగా ఎమ్మెల్యే దగ్గ

రికి వెళ్ళినాడు. ఎమ్మెల్యే ఆ నాయకుడిని పలకరించినాడు.

"వంకలో బట్టీకాడ సారాయి కాంచుతాండరని, మన అబ్బిరెడ్డి కొడుకులనూ... ఇద్దరు మంచులనూ పట్టకపోయినారన్నా...! రోంత నువ్... ఫోన్ చేసి సెప్పాల!" నసుగుతూ అన్నాడు ఆ చోటా నాయకుడు.

"ఏపొద్దూ నిన్ను ఏదీ అడగల్యా! ఈ పొద్దు పిల్లోని ఇడిపియ్యమని అడుగుతాండ" ఆ చోటా నాయకుడితోపాటుగా వచ్చిన అబ్బిరెడ్డి శృతి కలిపినాడు.

"ఎక్సైజ్ సి.ఐ. ఆనందరావే కదూ!" అక్కడికి వచ్చిన నారాయణరెడ్డిని అడిగినాడు ఎమ్మెల్యే. 'ఔను' అన్నట్లు తలూపినాడు నారాయణరెడ్డి.

"నేను ఫోన్ జేచ్చులే...! మీరు పొర్రి!" చోటా నాయకుడినీ, అబ్బిరెడ్డిని పక్కకు పంపినాడు ఎమ్మెల్యే.

"దొంగనాకొడుకు అబ్బిరెడ్డిగాడు... పోలింగ్‌బూత్ పక్కనే ఉండావు... ఇంట్లో బాంబులు పెట్టికోరా అంటే వద్దంటాడా? తొక్కాల నా కొడుకును" ఎమ్మెల్యే వైపు చూస్తూ కుడిభుజంలాంటి నాయకుడు ఒకరు ఊగిపోయినాడు కోపంగా!

లచ్చుమయ్య మళ్ళీ జనాన్ని తోసుకుంటూ మళ్ళీ ఎట్నోకట్ట ఎమ్మెల్యేకు దగ్గరగా వచ్చినాడు. ఎందుకైనా మంచిదని ఎమ్మెల్యేకు రెండు చేతులెత్తి దండం పెట్టినాడు. ఏదో ఆలోచిస్తూ, ఎక్కడో చూస్తున్నట్టుగా ఉన్న ఎమ్మెల్యే నుంచి స్పందన రాకపోవడంతో మళ్ళీ దండం పెట్టినాడు లచ్చుమయ్య.

లచ్చుమయ్యను గమనించిన ఎమ్మెల్యే కనుబొమలు ఎగరేస్తూ 'ఏం' అన్నట్లుగా ఎగాదిగా చూసినాడు.

"మన వెంకట్రాముని నాయన... నిన్ను సూడ్డానికేమో వచ్చినాడు" నారాయణరెడ్డి కల్పించుకుని ఎమ్మెల్యేకు పరిచయం చేస్తున్నట్టుగా చెప్పినాడు.

వెంకట్రాముడు కూడా లచ్చుమయ్యను గమనించినాడు...

"ముసిలోల్ల పించను ఇప్పియ్యాల సోమీ" ఎమ్మెల్యేను అడిగినాడు లచ్చుమయ్య.

"ముసిలోనితో ఏం లేన్నా..! ఏదో ఒకటి అడుగుతాంటడు" అక్కడికి బరబరా వచ్చిన వెంకట్రాముడు లచ్చుమయ్యను రెట్టపట్టుకుని పక్కకు తోసుకొని పోయినాడు.

"అంతమందిలో పించను కోసం ఎమ్మెల్యేను అడుగుతవా? ఉండే పిస్టేజి రోంతా పొగొట్టివే! ఇంటికి పోతవా లేదా?" లచ్చుమయ్యను గదమాయించినాడు వెంకట్రాముడు.

విందు వంటకాల వాసన గుప్పుమంటోంది.

లచ్చుమయ్యకు నోరూరింది.

పించను రాకపోతే ఎటెమ్మడికి పాయ! ఇంత బువ్వన్నా తిని పొమ్మంటాడని కొడుకువైపు ఆశగా చూసినాడు లచ్చుమయ్య.

నోరు తెరిచి అడుగుదామనుకున్నాడు.

"నువ్వు ఇంటికి పా... నేనొచ్చాండ" అంటూ లచ్చుమయ్యను ఇంటికి సాగనంపినాడు వెంకట్రాముడు.

నారాయణరెడ్డి బరబరా అక్కడికి వచ్చి, వెంకట్రాముడి చెవిలో ఏదో అనుమానం వ్యక్తంచేసినాడు.

"ఆ... యాదికొచ్చారు... మనమేమన్నా గాజులు తొడక్కోని ఉండామా? అన్నీ రడీగా ఉండాయి" భరోసా ఇచ్చినట్లుగా మాట్లాడినాడు వెంకట్రాముడు.

ఏవో సరి చూసుకుంటూ గడ్డివాముల వైపు నడిచినారు నారాయణరెడ్డి, వెంకట్రాముడూ!

లచ్చుమయ్య నిరాశగా ఇంటికి చేరినాడు. పించను అడగనియ్యనందుకు వెంకట్రాముడిపై కోపంగా ఉంది. నారాయణరెడ్డి ఇంట్లో విందు వాసనలు గుర్తుకు వస్తున్నాయి.

వెంకట్రాముడు హడావుడిగా ఇంటికి వచ్చినాడు. టిఫిన్ క్యారియరు ఒకటి బరువుగా తెచ్చి గూట్లో పెట్టినాడు.

"కుక్కలేమైనా కలబెడ్తయేమో... ఇది సూచ్చాండు!" లచ్చుమయ్యకు టిఫిన్ క్యారియర్ చూపిస్తూ చెప్పి మళ్ళీ విసురుగా పోయినాడు.

"ఏ పొద్దూ... ఇదో నాయనా ఇది తిను... అని పెట్టనివాడు... ఈ పొద్దు పొద్దు ఎట్ట తెచ్చినాడబ్బా!" టిఫిన్ క్యారియర్ చూస్తూ అనుకున్నాడు లచ్చుమయ్య.

*** *** ***

డిన్నరు ఏర్పాట్లు పూర్తి అయినాయి.

"లెయ్‌న్నా! నీళ్ళ ట్యాంకు కాడ రిబ్బను కత్తరిచ్చి, డిన్నరుకు కూర్చుందాం" ఎమ్మెల్యేను పురమాయించినాడు నారాయణరెడ్డి.

తప్పెట్లు, బ్యాండు, టపాకులు మళ్ళీ మోగినాయి. ఎమ్మెల్యే లేసినాడు. రిబ్బను కత్తరించగానే ఎమ్మెల్యేను డిన్నరు గదిలోకి తీసుకువెళ్ళినాడు నారాయణరెడ్డి. వెంకట్రాముడు ఎమ్మెల్యే పక్కనే ఉంటూ, ఎమ్మెల్యేను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నట్లు వ్యవహరిస్తున్నాడు.

ఎమ్మెల్యే వెంకట్రాముడి భుజంపై చేయితో తట్టి ప్రశంసగా దగ్గరికి తీసుకున్నాడు.

డిన్నరు గది మసాలా వాసనతో గుప్పుమంటోంది.

"ఏదన్నా జరిగితే మన పిస్టేజేంగావాలన్నా! నీ పాణమొకటీ మా పాణమొకటా?" ఎమ్మెల్యేతో భరోసాగా అన్నాడు వెంకట్రాముడు.

డిన్నరు మత్తులో అనుచరుల కోలాహలం తారాస్థాయికి చేరుకుంది.

*వెంకట్రాముడికి దు:ఖం ముంచుకుని వస్తోంది. ఏడ్వలేకపోతున్నాడు. నారాయణరెడ్డిని పక్కకు పిలుచుకునిపోయి ఏదో చెప్పినాడు. "ఎంత ఘోరం జరిగిపోయింది!" అన్నట్లుగా ఉన్నాయి నారాయణరెడ్డిలోని భావనలు!*

ఇంతలో పేలుడు... దిక్కులు పిక్కటిల్లే శబ్దం! ఎమ్మెల్యేతోపాటు అనుచరులు అదిరిపడినారు. డిన్నరు శిబిరం చెల్లాచెదురైంది.

నారాయణరెడ్డి ఒళ్ళు జలదరించింది.

"ఎల్లుకోర్రోయ్!" అంటూ పొలికేక వేసినాడు.

నారాయణరెడ్డి మనుషులు బాంబులు, యాటకొడవళ్ళు, నాటు తుపాకులు తీసుకోని, తలా ఒక దిక్కుకు ఉరకబట్టినారు.

"ఒరే సిన్నోడా... నువ్వూ, సూర్యుడూ వామిదిక్కు తిరుక్కోర్రి... ఒరేయ్ ఎంగిటిగా... నువ్వూ సెన్నుగాడూ మడిమిద్దె ఎక్కర్రి... బాంబులు తీసుకోర్రి... గుండ్రాళ్ళు సేదర్రి" ఆదేశాలు జారీ చేసినాడు నారాయణరెడ్డి.

"నాకొడుకులు... ఎమ్మెల్యే వచ్చినాపొద్దే సెనుకుతరా? ఈపొద్దు తేల్చుకోవాల!" నారాయణరెడ్డి అనుచరుడు ఒకరు అపోజిషన్ వాళ్ళను తిట్టబట్టినాడు.

"మన వెంకట్రాముని ఇంటి మింద బాంబులేసినారు" ఎవరో పరిగెత్తుకుంటూ వచ్చి నారాయణరెడ్డితో చెప్పినారు.

వెంకట్రాముడి పాదాల కింద దుమ్ములేసింది.

"తొందరపడగాకర్రి... నేను మళ్ళా వచ్చా!" అంటూ ఇంటికి పరుగుతీసినాడు వెంకట్రాముడు.

పేలుడుతో కూలిపోయిన పైకప్పు కింద లచ్చుమయ్య శవమైనాడు. లచ్చుమయ్య పక్కనే అల్యూమినియం టిఫిన్ క్యారియర్ తునాతునకలై పడిఉంది.

ఎమ్మెల్యేతో కలిసి నారాయణరెడ్డి అనుచరగణం అక్కడికి చేరుకున్నారు.

వెంకట్రాముడికి దు:ఖం ముంచుకుని వస్తోంది. ఏడ్వలేకపోతున్నాడు. నారాయణరెడ్డిని పక్కకు పిలుచుకునిపోయి ఏదో చెప్పినాడు.

"ఎంత ఘోరం జరిగిపోయింది!" అన్నట్లుగా ఉన్నాయి నారాయణరెడ్డిలోని భావనలు!

కోర్టు వాయిదా నుంచి తిరిగి వచ్చిన అపోజిషన్ నాయకుడు సుధాకర్‌రెడ్డి, మనుషులతోపాటు హుషారైనాడు! తర్వాత జరిగిన విషయం తెలుసుకుని తమాయించుకున్నాడు.

వెంకట్రాముడిని పేలుడు సంఘటనపై కేసు భయం పట్టుకుంది. బాంబుల పేలుడు సంఘటన నుంచి రక్షించాల్సిందిగా వెంకట్రాముడూ, నారాయణరెడ్డీ ఎమ్మెల్యేను వేడుకున్నారు.

ఎమ్మెల్యేతో నారాయణరెడ్డి రహస్యంగా ఏవో చర్చలు జరిపినాడు. ఏవో కాగితాల్లో వెంకట్రాముడితో సంతకాలు పెట్టించుకున్నాడు నారాయణరెడ్డి.

– తెల్లవారింది.

"బాణసంచా పేలి ఒకరి మృతి- బాధితుని కుటుంబానికి లక్షరూపాయల ఆర్థికసాయం" పేలుడు సంఘటనపై పేపర్లో వార్తతోపాటు "తండ్రిని పోగొట్టుకున్న కొడుకును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే" రైటప్‌తో ఫోటో ప్రచురితమైంది!

## స్టేజీప్రదర్శనలపై 'సీమ'కన్ను!



ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'బాండిట్ క్వీన్' సీమాబిస్వాస్‌కు కెమెరా ముందుకంటే జనంముందు స్టేజీపైన నటించడమే మహాసరదాగా వుంది. అందుకే ఆవిడ 'ఎవ్వరు ఎలా పోతే నాకేటి' అనుకుంటూ తను ఒప్పుకున్న సినిమాల నిర్మాతలను నట్టేటముంచి 'స్టేజ్ ప్రదర్శన'ల వైపు పరుగులు పెడుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్ నుండి వచ్చేఏడాది అంటే 2000ల సంవత్సరం ఏప్రిల్‌వరకు కాల్‌షీట్స్ నన్నింటినీ రద్దుచేసుకున్న సీమ "స్టేజీ ప్రదర్శనలలోనే ఎంతో హాయి ఉంది. ఎలాంటి సంకోచం లేకుండా నటించవచ్చు" అంటోంది. అస్సామీ మొబైల్ థియేటర్ బృందంతో కలిసి ఇప్పటికి 90 స్టేజీ ప్రదర్శనలిచ్చిన సీమలో ఉత్సాహం ఉరకలేస్తోందట. ఇంతకూ స్టేజ్‌ప్రదర్శనలలో ఆవిడ పాత్ర గతంలో ఆవిడకు అవార్డు తెచ్చిపెట్టిందే. వచ్చిన అవార్డును మర్చిపోగూడదనేమో ఈ మోజు!